క్లుప్తంగా

'చల్లా'ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



వంశీచంద్‌రెడ్డిని సత్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్

ఆమనగల్లు: పాలమూరు ప్రగతికోసం పాలమూరు న్యాయయాత్ర చేపట్టిన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డిని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, యూత్‌కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, హీరాసింగ్, తులసీరాం, రాముునాయక్ కలిశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మక్తల్ నుంచి నాలుగు రోజుల క్రితం పాలమూరు న్యాయయాత్ర పేరిట వంశీచంద్‌రెడ్డి పాదయాత్ర నిర్వహిస్తున్నారు. శనివారం పాదయాత్రలో శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అంతకుముందు వంశీచంద్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. పాదయాత్ర విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు.

నూతన కమిటీ ఎన్నిక



కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న మహ్మద్ రఫీ

కడ్తాల్: మండల కేంద్రంలోని భగత్‌సింగ్ నాయీ బ్రాహ్మణ సహకార సంఘం నూతన గ్రామ కమిటీని బీసీ సంక్షేమ శాఖ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ రఫీ ఉద్దీన్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కానుగుల లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా కానుగుల శివ, కార్యదర్శిగా మహేందర్‌తో పాటు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీకి నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం నూతన కమిటీని సంఘం సభ్యులు సన్మానించారు. జంగయ్య, అంజయ్య, శంకరయ్య, శ్రీను, సత్తయ్య, శ్రీనివాస్, వెంకటేశ్, మహేశ్, వెంకటేశ్, గోపాల్, కరుణాకర్, మురళి, రాజు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం



చంద్రాయణపల్లిలో భక్త సిరియాల నాటక ప్రదర్శన

మాడ్గుల: మాడ్గుల మండలం చంద్రాయణపల్లి గ్రామంలో 3 రోజులుగా నిర్వహిస్తున్న భక్త సిరియాల నాటక ప్రదర్శన ముగిసింది. చంద్రాయణపల్లి గ్రామంలో ప్రతిరోజూ రాత్రి నుంచి ఉదయం వరకు మూడు రోజుల పాటు భక్త సిరియాల నాటకం ప్రదర్శించారు. భక్త సిరియాలగా మంగళపల్లి అంజయ్య, సిరిదొండ మహారాజుగా తానయ్య, సుగుణాదేవిగా రమేశ్, సాంబమూర్తిగా శేఖర్, నందయోగిగా చరమంద, మంత్రిగా గాలయ్య, శివపార్వతులుగా బక్కయ్య, కృష్ణయ్య, పడాల రాజుగా కమలాదేవి నటించారు. మూడు రోజుల పాటు ప్రదర్శించిన నాటకం ప్రజలను ఆకట్టుకుంది. శనివారం కళాకారులను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ యాదిరెడ్డి, ఎంపీటీసీ జైపాల్‌రెడ్డి, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహపాల్గొన్నారు.

పల్లెల్లో 'ప్రత్యేక' పాలన ఆరంభం



బాధ్యతలు తీసుకుంటున్న ఎంపీడీఓ శ్రీనివాస్

మంచాల: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. దీంతో పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. మంచాల మండలంలో ఆరుట్ల, పటేల్ చెరువు తండా గ్రామాలకు ప్రత్యేకాధికారిగా ఎంపీడీఓ చిలుకూరి శ్రీనివాస్, లోయపల్లి, ఆంబోత్ తండాలో తహసీల్దార్ వెంకట ప్రసాద్, మంచాల, చిత్తాపూర్, తిప్పాయి గూడలో ఎంపీఓ తేజేసింగ్, లింగంపల్లి, తాళ్లపల్లిగూడలో ఏఓ జ్యోతిశ్రీ, బోడకొండ, ఎల్లమ్మ తండాలో ఇరిగేషన్ డీఈఈ స్నేహలత, జాపాలలో రంగాపూర్ పంచాయతీ రాజ్ ఏఈఈ సాయినాథ్, బండలేమూర్, చెన్నారెడ్డి గూడలో ఆర్అండ్‌బీ ఏఈఈ వినోద్‌కుమార్, దాద్‌పల్లి, చీదేడ్‌లో ఇరిగేషన్ ఏఈఈ శారద,సత్తి తండా, కొర్ర వాణి తండాలో ఇరిగేషన్ ఏఈఈ మోహన్ చంద్ర ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు తీసుకున్నారు.

ఆశలు ఆవిరి

- వేసవికి ముందే అడుగంటుతున్న భూగర్భజలాలు
- నాడు చెరువులకు జలకళ.. నేడు వెలవెల
- గణనీయంగా పడిపోతున్న నీటిమట్టం
- ఆందోళనలో రైతులు

వేసవి సమీపించకముందే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రోజురోజుకు అడుగంటుతున్న భూగర్భజలాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రెండేళ్ల క్రితం మండలంలో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా పరిస్థితి తయారైంది. వర్షాలు లేక చెరువులు, కుంటలు ఆవిరైపోతున్నాయి. చాలాచోట్ల బోర్లు ఎండిపోయాయి. యాసంగి సాగేదెలా అని అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. యాసంగిపై గంపెడాశ పెట్టుకున్న కర్షకులకు నిరాశే మిగిలింది.



నానక్‌నగర్‌లో ఎండిపోయిన చెరువు

యాచారం: భూగర్భజలాలు అమాంతం పడిపోతున్నాయి. రోజురోజుకు ఎండల తీవ్రత పెరగడంతో బోరుబావుల్లో నీళ్లు పాతాళానికి వెళ్లిపోతున్నాయి. రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలతో యాచారం మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు అలుగుపారాయి. ఆ తర్వాత వర్షాల జాడే లేదు. చెరువులు, కుంటల్లోని నీళ్లు ఎండిపోవడంతో భూగర్భజలాలు అండుగంటుతున్నాయి. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 105 వరకు చెరువులు, కుంటలు ఉన్నాయి. దాదాపు 7,500 వరకు బోరుబావులు ఉన్నాయి. బోరుబావుల కింద 25 వేలకు పైగా ఎకరాల్లో వరి, కూరగాయలు, పండ్ల తోటలు, ఆకుకూరల పంటలు సాగు చేసి రైతులు జీవనోపాధి పొందారు. ప్రస్తుతం ఆ పరిస్థితి తారుమారయ్యే ప్రమాదం ఏర్పడింది. గొలుసుకట్టు చెరువులు, కుంటలున్న తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, తక్కళ్లపల్లి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో కూడా చెరువులు, కుంటల్లో నీళ్లు లేక భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి.

ఎండిపోతున్న బోరుబావులు

యాచారం మండలంలోని పలు గ్రామాల్లో బోరుబావులన్నీ ఎండిపోయాయి. ఐదేళ్లుగా భూగర్భజలాల పుష్కలంగా ఉండడంతో రైతులు వరి, కూరగాయల పంటలు సాగు చేసి జీవనోపాధి పొందేవారు. రోజురోజుకు తగ్గుతున్న భూగర్భ జలాలతో పంటలు సాగుచేస్తే నష్టపోతామనే భయంతో అన్నదాతలు వెనుకడుగు వేస్తున్నారు. మొండిగౌరెల్లి, యాచారం, గడ్డమల్లయ్యగూడ, గునుగల్, చౌదర్‌పల్లి, చింతుల్ల, నందివనపర్తి, నస్దిక్‌సింగారం, అయ్యవారిగూడెం తదితర గ్రామాల్లో కొద్ది రోజుల్లోనే వందలాది బోర్లు ఎండిపోయాయి. ఈ ఏడాది రైతుబంధు నిధులు జమ కాకపోవడం, పంటల్లో పెట్టుబడులు పెడితే నీళ్లు అందక పంటలు ఎండిపోతే నష్టపోతామనే రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాగుపై అనాసక్తి

యాచారం మండలంలో ప్రతి యాసంగిలో దాదాపు 10 వేల ఎకరాల్లో వరి పంట సాగు అయ్యేది. వరి నాట్ల అదును దాటిపోతున్న నేటికి యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 300 ఎకరాల్లో కూడా వరి పంట సాగు కాలేదు. చింతపట్ల, నల్లవెల్లి గ్రామాల్లోని చెరువుల్లో నీళ్లున్నా ఎండల తీవ్రతకు చెరువులు అడుగంటితే నష్టపోతామనే ఆందోళనలో రైతులు ఉన్నారు. కూరగాయల పంటలు అత్యధిక సాగు చేసే మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి, చింతుల్ల, గునుగల్ తదితర గ్రామాల్లో కూడా రైతులు పంటల సాగుకు ఆసక్తి చూపడం లేదు.

భూగర్భజలాలు పడిపోతున్నాయి



వారం రోజుల వ్యవధిలోనే రెండు బోరుబావుల్లో భూగర్భజలాలు అమాంతం పడిపోయాయి. ఎకరాల పొలంలో టమాటా, ఎకరాలో కాకర పంట సాగు చేశాను. దిగుబడి వస్తున్న సమయంలో భూగర్భజలాలు తగ్గిపోతుండడం ఆందోళనగా ఉంది.

– గుర్రం భాస్కర్‌రెడ్డి, రైతు మొండిగౌరెల్లి

ఆందోళనగా ఉంది



బోర్లలో నీళ్లు పుష్కలంగా ఉండడంతో 6 ఎకరాల్లో వరి పంట, మూడు ఎకరాల్లో కూరగాయ పంటలు సాగు చేశాను.ఈ ఏడాది నీళ్ల సమస్య వస్తుందనే భయంతో నాలుగు ఎకరాల్లోనే వరి పంట వేశాను. ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతోఆందోళన నెలకొంది.

– గౌర నర్సింహ, రైతు చౌదర్‌పల్లి

తగ్గుతున్న వరి సాగు



యాచారం మండలంలోని పలు గ్రామాల్లో బోరుబావుల్లో భూగర్భజలాలు తగ్గిపోతున్నాయని రైతులు తెలియజేస్తున్నారు. రెండు వందల అడుగుల లోతున్న బోరుబావులన్నీ ఎండిపోతున్నాయని రైతులు సమాచారం ఇస్తున్నారు. యాసంగిలో 8 వేలకు పైగా వరి, రెండు వేల ఎకరాలకు పైగా కూరగాయల పంటలు సాగు అవుతాయని అంచానా వేశాం. కానీ నేటికి వరి పంట సాగు 400 ఎకరాలు కూడా దాటలేదు.

– సందీప్‌కుమార్, వ్యవసాయాధికారి

అక్రమ నిర్మాణాలపై చర్యలు

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

తుర్కయంజాల్: అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్ హెచ్చరించారు. పురపాలక సంఘం పరిధిలో పలు చోట్ల చేపడుతున్న అక్రమ నిర్మాణాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని తెలిపారు. అయినా నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని కూల్చివేస్తామని పేర్కొన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శనివారం అక్రమ నిర్మాణాల పనులను నిలిపివేయించారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: తలకొండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో డీఈఓగా సిద్ధు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా భాను, మరో 25 మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం జరిగిన ముగింపు సభలో విద్యార్థులకు బహుమతులు అందించారు.

కాంగ్రెస్ విజయం ఖాయం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల నుంచే ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు దూషించడం మొదలు పెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగుతుందని, అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలను నేరవేర్చడం జరిగిందన్నారు. దేశంలో కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్, రాంచందర్‌నాయక్, శ్రీను, రాజేశ్, రమేశ్‌నాయక్ ఉన్నారు.



చీకట్లో తుర్కయంజాల్ చౌరస్తా

- సాగర్ రహదారిపై అంధకారం
- వెలగని వీధి దీపాలు
- పట్టించుకోని అధికారులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు, ప్రజలు

రోజూ అమావాస్యే..!

తుర్కయంజాల్: చీకటి పడిదంటే చాలు సాగర్ రహదారిపై ప్రయాణమే కాదు, కనీసం రోడ్డు దాటడం కూడా ప్రమాదకరంగా మారింది. రోజు రోజుకు రద్దీ పెరుగుతున్నా.. దానికి తగ్గట్లు ఏర్పాట్లు చేయకపోవడం, వీధి దీపాల నిర్వాహణ గాలికి వదిలేయడంతో చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల నివారణకై ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, పోలీసు శాఖ సిబ్బంది దృష్టి సారించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గుర్రం గూడ చౌరస్తా నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు నిర్వాహణ పూర్తిగా అటకెక్కడంతో వాహనదారులు, నడుచుకుంటూ రోడ్డు దాటే వారు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు.

చీకటి పడిందంటే చాలు

ప్రధాన చౌరస్తాలు, కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. వీధి దీపాలు వెలగక రోజూ అమావాస్య చీకట్లే కనిపిస్తున్నాయి. దీంతో రోడ్డు దాటాలంటేనే జనం జంకుతున్నారు. నెల రోజుల క్రితం వీఎంఆర్ గార్డెన్స్ ఎదురుగా రోడ్డు దాటుతున్న ఓ మహిళను కారు ఢీ కొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఈ నెల 24న ఇంజాపూర్ చౌరస్తాలో కారు, ఆటో ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. అంధకారంతో చాలా మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.

నిర్వహణ శూన్యం

మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 12,500 వీధి దీపాల నిర్వాహణను ఈఈఎస్ఎల్ సంస్థకు అప్పగించారు. కొత్త లైట్ల కొనుగోలు, బిగించడం, నిర్వాహణ బాధ్యత సంస్థదే. ప్రతి నెల రూ. 8 లక్షల వరకు మున్సిపాలిటీ అధికారులు చెల్లిస్తున్నట్లు సమాచారం. లైట్లు వెలగకపోయినా, సమస్యలున్నా సదరు కాంట్రాక్టు సంస్థ సరిగ్గా స్పందించడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

సాగర్ రహదారితో పాటు మున్సిపాలిటీ పరిధిలోని పలు చోట్ల వీధి దీపాల సమస్య ఉన్నమాట వాస్తవమే. దీనిపై ఇప్పటికే పలుమార్లు ఈఈఎస్ఎల్ సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకుపోయాం. అయినా స్పందించడం లేదు. పాలకవర్గ సమావేశంలో చర్చించి సీడీఎంఏ దృష్టికి తీసుకుపోతాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– మల్లిఖార్జున్,ఏఈ, తుర్కయంజాల్, మున్సిపాలిటీ

సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మున్సిపల్ కన్వీనర్ ఎల్లేశ్, మంచాల మండల కన్వీనర్ పోచమోని కృష్ణలు కోరారు. ఈ మేరకు సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి శనివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ తదితర సంఘాలతో పాటు ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా ఈనెల 16న గ్రామీణ భారత్ బంద్ పాటించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బుగ్గరాములు, నర్సింహ, బేబీ, బాలమణి, పద్మ, పెంటమ్మ పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమి ఆక్రమణకు యత్నం

నిరసన తెలిపిన ప్రజలు

- అక్రమంగా పొందిన ఇంటి నంబర్లను రద్దు చేసిన కమిషనర్

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామకంఠం భూమిని కొందరు కబ్జా చేయడమే కాకుండా.. మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లను పొందారని, వాటిని రద్దు చేయాలంటూ పాత ఎస్సీ కాలనీ, అంబేద్కర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట స్థానిక బీఆర్ఎస్ నాయకుడు చెరుకూరి జగన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కమిషనర్ రవీందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి ఆరో వార్డు గ్రామకంఠం భూమిని కబ్జాచేసి, నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకొని, ఇంటి నంబర్లు సైతం పొందారని ఆరోపించారు. వీరికి ఓ ప్రజాప్రతినిధి బంధువులు మద్దతుగా నిలిచారని విమర్శించారు. ఆక్రమించుకున్న స్థలంలో ఎలాంటి ఇంటి నిర్మాణాలు లేవని, నాలుగు ప్లాట్లకు నకిలీ అనుమతులు ఉన్నట్లుగా ప్రొసిడింగ్స్ తయారు చేసి, ఇంటి నంబర్లు తీసుకున్నారని, వాటిని తక్షణమే రద్దుచేసి, ఆక్రమించుకున్న గ్రామకంఠం భూమిలో చేపట్టిన ప్రహరీ నిర్మాణాన్ని కూల్చివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వాటిని రద్దు చేయాలని సబ్ రిజిస్ట్రారును కోరారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ, ప్రహ్లాద్, రాజు, సీపీఎం నాయకులు నరసింహ, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు

గ్రామ కంఠంలో నకిలీ పత్రాలతో పొందిన ఇంటి నంబర్లను రద్దు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సదరు రద్దుచేసిన పత్రాలను సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అందజేసి, తమకు న్యాయం చేయాలని కోరుతూ.. మునుముందు ఎటువంటి రిజిస్ట్రేషన్ చేయకూడదని సదరు వ్యక్తులను కోరారు.



పురపాలక కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంబేద్కర్‌నగర్ వాసులు

సద్వినియోగం చేసుకోండి

తలకొండపల్లి: ప్రధాన మంత్రి భారతీయ జన్ ఔషధి పరియోజన పథకాన్ని కేంద్రప్రభుత్వం అమలులోకి తెచ్చిందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు జన్ ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకుంటే ఈ పథకం ద్వారా రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు. నాణ్యమైన మందులను తక్కువ ధరలకే అందించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండల స్థాయి చెకుముకి పోటీలు



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

తలకొండపల్లి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీలను మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. 8,9, పదో తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పడకల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల నుంచి వినయ్ కుమార్, తేజశ్రీ, ఆనంద్ కుమార్, వెల్జాల్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి స్పందన, స్వాతి, పల్లవి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రాములయ్య తెలిపారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఝాన్సీలక్ష్మి, ఆంజనేయులు, సురేశ్, విష్ణుమూర్తి, భగ్‌వాన్‌రెడ్డి, భక్యానాయక్, గీతాంజలి, శ్రీధర్, విద్యార్థులు, పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధ్యం



మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

కడ్తాల్: కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ గోవర్ధన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రగతి పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా పదవీ విరమణ పొందిన లక్ష్మీనర్సింహారెడ్డి, గణేశ్‌గౌడ్, శ్రీరాములును పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా సువర్ణ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా కడ్తాల్ గ్రామ పంచాయతీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందడం జరిగిందని, పాఠశాల పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులుగా గ్రామానికి సేవలు అందించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సర్పంచ్ పదవి కీలకమైనది

గ్రామాలాభివృద్ధిలో సర్పంచ్ పదవి కీలకమైనదని గౌడ సంఘం నాయకులు అన్నారు. కడ్తాల్ గ్రామ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి, వార్డు సభ్యులు గణేశ్ గౌడ్‌ను శనివారం మండల కేంద్రంలో గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, వార్డు సభ్యుడిగా వారు అందించిన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, నాయకులు యాదయ్యగౌడ్, రాజేందర్, శంకరయ్య, రమేశ్‌గౌడ్, కేశవులుగౌడ్, శ్రీరాములుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జంగయ్య, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



మాజీ సర్పంచ్ ఉదయశ్రీ, వార్డు సభ్యులను సత్కరించిన గ్రామస్తులు

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి మాజీ సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ, మాజీ వార్డు సభ్యులకు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

మాజీ సర్పంచ్‌కు సత్కారం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చంద్రధన మాజీ సర్పంచ్ బక్కి కుమార్‌ను శనివారం సన్మానించారు. ఈ సందర్భగా కుమార్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమించానని తెలిపారు. పదవీ ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేస్తానని పేర్కొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386